ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం

వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం

వ్యవసాయ పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్.

బులెటిన్ నెం. XXXV/53/2024

రాష్ట్ర రైతాంగానికి

వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు

తేది: 03.07.2024 (బుధవారం) నుండి 07.07.2024 (ఆదివారం) వరకు

గ్రామీణ కృషి మౌసమ్ సేవ పథకం (GKMS Project)

భారత వాతావరణ శాఖ, న్యూఢిల్లీ.

**గత మూడు రోజుల వాతావరణం:**

గడిచిన మూడు రోజులలో రాష్ట్రంలో కొన్ని చోట్ల భారీ వర్షాలు మరియు చాలా చోట్ల తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురిసాయి. పగటి ఉష్ణోగ్రతలు 27 నుండి 35 డిగ్రీల సెల్సియస్ మరియు రాత్రి ఉష్ణోగ్రతలు 21 నుండి 25 డిగ్రీల సెల్సియస్ గా నమోదయ్యాయి.

**రాబోవు ఐదు రోజుల వాతావరణ విశ్లేషణ (ఈరోజు మధ్యాహ్నం 1300 గంటల ఆధారంగా):**

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వారు అందించిన సమాచారం ప్రకారం రాబోవు ఐదు రోజులలో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 30 నుండి 37 డిగ్రీల సెల్సియస్ మధ్య మరియు రాత్రి ఉష్ణోగ్రతలు 21 నుండి 26 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదుకావచ్చు.

## వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు

- నైరుతి ఋతుపవనాలు రాష్ట్రంలోకి జూన్ 3వ తేదీన ప్రవేశించి జూన్ 12వ తేదీన రాష్ట్రమంతటా విస్తరించాయి.
- నైరుతి ఋతుపవనాలు రాష్ట్రంలోనికి ప్రవేశించిన తరువాత తేలిక పాటి నేలల్లో 50 నుంచి 60 మి.మీ. మరియు బరువు నేలలో 60 నుంచి 75 మి.మీ వర్షపాతం నమోదైన తరువాత లేదా నేల 15-20 సెం.మీ. లోతు తడిసిన తరువాతనే రైతులు వర్షాధార పంటలైన ప్రత్తి, సోయాచిక్కుడు, మొక్కజొన్న, జొన్న, కంది, పెసర మొదలగు పంటలను విత్తుకోవాలి.
- వేరుశనగ, సోయాచిక్కుడు, జొన్న, పెసర, కంది మరియు మినుము పంటలను విత్తుకునే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలి.

**వరి**

- **వర్షపాతం ఎక్కువగా నమోదయ్యే ఉత్తర తెలంగాణ మరియు మధ్య తెలంగాణ మండలాలలోని జిల్లాలలో పొడిగా విత్తి తడి పద్దతిలో సాగు చేసే వరి పంటను విత్తుకొనుటకు అనుకూల సమయం.**
- నీరు సంవృద్ధిగా ఉన్న ప్రాంతాల్లో రైతులు మధ్యకాలిక (130-135 రోజుల) లేదా స్వల్పకాలిక (120-125 రోజుల) వరి రకాల నారుమళ్ళు పోసుకోవడానికి ఇది అనువైన సమయం.
- 25రోజుల వయస్సు ఉన్న దీర్ఘకాలిక వరి రకాలను నాటు పెట్టుకోవాలి.
- నాటు పెట్టిన తర్వాత ప్రతి 2మీటర్లకు కాలిబాటను తీయటం వలన గాలి వెలుతురూ బాగా ప్రసరించడంతో బాటు సుడిదోమ ఉధృతిని నివారించవచ్చు. అదేవిధంగా రైతులు ఎరువులు మరియు పురుగు మందులు పంటకు అందించడానికి సులువుగా ఉంటుంది.

- వరి నాట్లు వేసుకునే వారం రోజుల ముందు ఎకరాకు సరిపోయే నారుమడికి 800 గ్రా. కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలను ఇసుకలో కలిపి చల్లి నట్లయితే ప్రధాన పొలంలో పంటను 15-20 రోజుల వరకు కొన్ని రకాల పురుగుల నుండి కాపాడుకోవచ్చును.
- **జులై మాసం తెలంగాణ సోన (RNR 15048) వరి రకంతో నారుమడి పోయుటకు అనుకూలం.**
- **ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో రాష్ట్రంలో అక్కడక్కడ వరి పంటలో కాండం తొలిచే పురుగు గమనించడమైనది. నివారణకు, 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3 సిజి గుళికలను వేసుకోవాలి.**
- వరి సాగు చేసే రైతులు వరిగట్లను శుభ్రంగా ఉంచుకోవాలి లేనట్లయితే గట్లమీద ఉండే కలుపు మొక్కలపైన కాండం తొలుచు పురుగు మరియు అగ్గి తెగులు నివసించి వరి పంటను ఆశించును.
- వరి మొక్కలను పోలిన ఊద మరియు ఒడిపిలి గడ్డిజాతి కలుపు మొక్కల నివారణకు 7.5మి.లీ. సైహలోఫాప్–పి-బ్యుటైల్ మందును 5లీటర్ల నీటిలో కలిపి 15రోజుల వయస్సు గల వరి నారుమడిలో పిచికారి చేయాలి.

## ప్రత్తి

- ప్రత్తి పంటను జులై 20వ తేదీ వరకు దిగుబడిలో ఎటువంటి తరుగుదల లేకుండా సాగు చేసుకోవచ్చు.
- వర్షాదార ప్రత్తి పంట బోదెలు మరియు కాలువల పద్ధతిలో విత్తుకున్నట్లయితే తేమ సంరక్షించుకోవటంతో పాటు ఎక్కువ వర్షాలు పడినప్పుడు కాలువల ద్వారా నీటిని తీసివేయుటకు అనుకూలంగా ఉంటుంది.
- **ప్రత్తిలో అక్కడక్కడ రసం పీల్చే పురుగులు గమనించడమైనది. ముందు జాగ్రత్తగా కాండానికి మందు పూసే పద్ధతిలో మోనోక్రోటోఫాస్ + నీరు (1:4 నిష్పత్తి) మిశ్రమ ద్రావణాన్ని 30 మరియు 45 రోజుల పంట దశలో కాండం మీద పూయాలి.**
- ప్రత్తి పంట విత్తిన 2 వారాల తర్వాత ముందు నివారణ చర్యల భాగంగా (preventive) రసం పీల్చే పురుగుల నియంత్రించడానికి ఎకరానికి 5 పసుపు మరియు 5 నీలం రంగు జిగురు అట్టలను అమర్చాలి.
- మొదటి దఫా పైపాటు నత్రజని మరియు పొటాషియం ఇచ్చే ఎరువులను 20 రోజుల తరువాత భూమిలో తేమ ఉన్నప్పుడు అందించాలి.

## మొక్కజొన్న

- మొక్కజొన్న పంటను జులై 15వ తేదీ వరకు మధ్య మరియు దీర్ఘకాలిక (90-100 రోజులు మరియు 100-120 రోజులు) రకాలను దిగుబడిలో ఎటువంటి తరుగుదల లేకుండా విత్తుకొనుటకు అనుకూల సమయం.
- మొక్కజొన్న శాకీయ దశలో ఎక్కువ నీటిని మరియు ప్రత్యుత్పత్తి దశలో నీటి ఎద్దడిని తట్టుకోలేదు కాబట్టి పంటను బోదెలు మరియు కాలువల పద్ధతిలో సాగు చేసుకోవలెను.

- ముందు నివారణ చర్య బాగంగా పంటను విత్తిన 15రోజుల వ్యవధిలో కత్తెర పురుగు నివారణకు **1500 పి. పి. ఎం. వేపనూనె మందును 5 మీ.లీ. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.**
- లింగాకర్షక బుట్టలను అమర్చడం ద్వారా కత్తెర పురుగు ఉధృతిని గమనించవచ్చు.
- ఆఖరి దుక్కిలో మొత్తం భాస్వారం, 1/3వ వంతు నత్రజని మరియు సగం పొటాష్ ఇచ్చే ఎరవులను చివరి దుక్కిలో వేసుకోవాలి.

## జొన్న

- **జొన్నలో మొవ్వ తొలచు ఈగ గమనించడమైనది. నివారణకు 2మి.లీ. కార్బోసల్ఫాన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.**

## ఆముదం

- ఆముదం పంటను జులై రెండవ పక్షం వరకు విత్తుకోవచ్చును.

## కంది

- కంది పంటను జులై 15వ తేదీ వరకు దిగుబడిలో ఎటువంటి తరుగుదల లేకుండా సాగు చేసుకోవచ్చు.
- కందిని ఎకపంటగా లేదా ప్రత్తి, మొక్కజొన్న, జొన్న, సోయాచిక్కుడు, పెసలు మరియు మినుములతో అంతర పంటగా సాగు చేసుకోవచ్చు.
- కంది పంటను విత్తే ముందు విత్తనాని 2.5గ్రా. కాప్టాన్ లేదా 3గ్రా. థైరామ్ మరియు 10గ్రా. ట్రైకోడేర్మా విరిడె మందుతో కిలో విత్తనానికి కలిపి విత్తుకున్నట్లయితే విత్తనం లేదా భూమి ద్వారా సంక్రమించే శిలీంద్రాల నుండి పంటను కాపాడవచ్చు.

## పెసర మరియు మినుము

- పెసర మరియు మినుము పంటను జులై 15వ తేదీ వరకు విత్తుకోవచ్చును.
- పెసర మరియు మినుమును ఎకపంటగా లేదా ప్రత్తి మరియు కందితో అంతర పంటగా సాగు చేసుకోవచ్చు.
- వరి సాగు చేసే పొలాల్లో, ఆలస్యంగా నీరు విడుదలయ్యే ప్రాంతాలలో పెసరను పైరుగా లేనిచో పచ్చి రొట్టగా విత్తుకోవాలి.
- పెసర మరియు మినుము పంట విత్తిన 2 వారాల తర్వాత ముందు నివారణ చర్యల భాగంగా (preventive) రసం పీల్చే పురుగుల నియంత్రించడానికి ఎకరానికి 5 పసుపు మరియు 5 నీలం రంగు జిగురు అట్టలను అమర్చలీ .

## సోయాచిక్కుడు

- సోయాచిక్కుడు పంటను జులై మొదటి వారం వరకు విత్తుకొనుటకు అనుకూల సమయం.
- నీటి వసతి గల తేలికపాటి నేలలు కూడా సోయాచిక్కుడు సాగుకు అనుకూలం.

- ఎత్తు మడులు మరియు కాలువల (Broad Bed and Furrow – BBF) పద్ధతిలో విత్తుకున్నట్లయితే విత్తన మోతాదు తగ్గటంతోపాటు సరైన సాంద్రతలో మొక్కలు ఉండి, సాగు ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు వస్తాయి.
- ఈ పద్ధతిలో భూమిలో ఎకువ తేమ నిలువ ఉండి పంట నీటి యద్దడిని తట్టుకుంటుంది. అదేవిధంగా ఎక్కువ నీటిని పొలం నుండి తీసివేయటానికి కాలువలు ఉపయోగపడతాయి.
- సోయాచిక్కుడు పంట విత్తిన 2 వారాల తర్వాత, కాండం తొలిచే ఈగ మరియు తెల్లదోమను నియంత్రించడానికి ఎకరానికి 5 పసుపు మరియు 5 తెలుపు జిగురు అట్టలను అమర్చలీ .
- ముందస్తు నివారణ చేర్యాలలో బాగంగా, సోయాచిక్కుడులో స్టెమ్ గిర్డర్‌ను నివారించడానికి, 1500 పి. పి. ఎం. వేపనూనె మందును 5 మీ.లీ. ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి

**వేరుశనగ**

- **వేరుశనగ పంటను జులై 15 వరకు విత్తుకొనుటకు అనుకూల సమయం.**
- **ప్రస్తత వాతావరణ పరిస్థితులు వేరుశనగలో మొదలుకుళ్ళు తెగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు మొక్కల మొదళ్ళ దగ్గర 2 గ్రా. కార్బండజిమ్ + మ్యాంకోజేబ్ మందును లీటరు నీటికి కలిపి నేలను తడపాలి.**

**కూరగాయలు**

- కూరగాయ పంటలలో రసం పీల్చే పురుగులు గమనించినట్లైతే, నివారణకు 1500 పి. పి. ఎం. వేపనూనె మందును 5 మీ.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- ప్రస్తుత వాతావరణ పరిస్థితులు కూరగాయల పంటలలో ఆకుమచ్చ తెగులు సోకుటకు అనుకూలము. తెగులు నివారణకు 1 గ్రా. కార్బెండజిమ్ లేదా 1 మి.లీ. ప్రోపికోనజోల్ మందును లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి.
- తీగ జాతి కూరగాయ పంటలు విత్తుటకు అనుకూలం.
- మిరప, టమాట, వంగ మరియు బంతి పంటలను ఎత్తు మడులమీద నారు పోయడం ద్వారా నారుకుళ్ళు తెగులు నివారించవచ్చు.

**బత్తాయి మరియు నిమ్మ**

- కొత్తగా తోటలు పెట్టె రైతులు 60 సెం.మీ. పొడవు, వెడల్పు, లోతు గల గుంతలు తీసి, దానిలో 5కిలోల పశువుల ఎరువు, 1కిలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ , 100గ్రా. క్లోరిపైరిఫాస్ పొడి మందులను పై మట్టికి కలిపి గుంతలను నింపుకోవాలి.
- నాణ్యమైన మొక్కలు నాటుకోవాలి.

- బత్తాయి మరియు నిమ్మ తోటలలో సిట్రస్ క్యాంకర్‌ను నియంత్రించడానికి, 1 గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ మరియు 30 గ్రాములు కాపర్ ఆక్సీ క్లోరైడ్ మందుని 10 లీటర్ల నీటికి కలిపి 20 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేసుకోవాలి .

**చెరకు**

- తోట వయస్సు నాలుగు నెలలప్పుడు (జూన్ – జులై మాసాల్లో) మొక్కల వరుసల మొదళ్ళకు ఎత్తుగా మట్టిని ఎగదోయాలి. దీని వలన అధిక వర్షాలు మరియు తుఫాను గాలులకు పంట పడిపోకుండా కాపాడుకోవచ్చు.

**మామిడి**

- రైతులు కోత అనంతరం 2-4 వారాల తరువాత ఎండు కొమ్మలను, తెగులు సోకిన కొమ్మలను మరియు అడ్డంగా పెరిగిన కొమ్మలను కత్తిరించినట్లయితే గాలి మరియు వెలుతురు మొక్కకు బాగా లబిస్తుంది.
- పోయిన సంవత్సరం వచ్చిన పూత కాడలను వెనుకకు కత్తిరించుకొని 3గ్రా. కాపర్ ఆక్సి క్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- తోటలో రాలిపోయిన, కుళ్ళిపోయిన, తెగుళ్ళు ఆశించిన కాయలతో పాటు ఎండుఆకులను మరియు కొమ్మలను సేకరించి తోటలకు దూరంగా కాల్చివేయాలి.

**పశుపోషణ**

- ప్రస్తుత వాతావరణ పరిస్థితులు కోళ్ళలో కొక్కెర తెగులు సోకుటకు అనుకూలం వీటి నివారణకు, టీకాలు వేయించాలి.
  - గొర్రెలలో చిటుకు మరియు PPR
  - ఆవులు మరియు గేదేలలో గొంతువాపు వ్యాధి సోకుటకు అనుకూలం వీటి నివారణకు, టీకాలు వేయించాలి.
  - గొర్రెలలో నట్టల నివారణకు డీవార్మింగ్ చేయవలెను.

ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి)& అధిపతి